క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: గూడూరు సబ్ డివిజన్ పరిధిలో 132 కేవీ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌లో 33 కేవీ మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ జేషన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గూడూరు, కోడుమూరు, సి.బెళగల్ మండలాల పరిధిలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుండి కేసీ కాల్వకు 331క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు శుక్రవారం డ్యామ్ అధికారులు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇన్‌ఫ్లో నిలిచిపోయినట్లు వారు తెలిపారు.

శరన్నవరాత్రుల ఉత్సవాలను జయప్రదం చేయండి



శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో దసరా సందర్భంగా ఈనెల 15నుంచి 23వతేదీ వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రికలను ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో తొమ్మిదిరోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. దాతల సహకారంతో ప్రతి రోజు భక్తులకు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేష్ నాయుడు, పూలవాసు, గిడ్డయ్య, రంగన్న పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ



క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

కర్నూలు సిటీ: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం స్కూళ్లకు మంజూరైన క్రీడా పరికరాలను మండల పరిషత్ అధ్యక్షురాలు డి.వెంకటేశ్వరమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉచితంగా క్రీడా పరికరాలను పంపిణీ చేస్తుందన్నారు. మండల పరిధిలోని 18 హైస్కూళ్లకు నాలుగైదు విభాగాల క్రీడ పరికరాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్, ఎంఈఓ వినోద్‌కుమార్, కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల సర్పంచ్ సాగర్ పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందజేయాలి



అనుగొండలో రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ జయన్న

కోడుమూరు రూరల్: బియ్యం పంపిణీ వాహనదారులు తప్పనిసరిగా కార్డుదారుల ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులను సక్రమంగా అందజేయాలని కోడుమూరు తహసీల్దార్ జయన్న సూచించారు. శుక్రవారం మండలంలోని అనుగొండ, ఎర్రదొడ్డి, కోడుమూరులలో రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనాలను తహసీల్దార్ పరిశీలించారు. నాలుగైదు రోజులుగా సర్వర్ సమస్యతో కార్డుదారులకు రేషన్ సరుకులను ఆఫ్‌లైన్‌లో పంపిణీ చేయడం జరిగిందని, ప్రస్తుతం సర్వర్ పనిచేస్తున్నందున ఆన్‌లైన్ ద్వారా పంపిణీ చేస్తున్నామని ఈ సందర్భంగా తహసీల్దార్ చెప్పారు. కార్డుదారులందరికీ రేషన్ సరుకులు తప్పక అందుతాయన్నారు. సరుకుల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జయన్న హెచ్చరించారు.

సాగు నీటిని పొదుపుగా వాడాలి

కర్నూలు సిటీ: శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితులను బట్టి హంద్రీనీవా కాలువకు 20 నుంచి 30 రోజుల వరకు మాత్రమే నీరు ఇవ్వడం జరుగుతుందని హంద్రీనీవా ఎస్ఈ డి.రామగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టులో ప్రస్తుతం 849.5 అడుగులు, 78.924 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. మాల్యాల నుంచి 834 అడుగులు(53.85 టీఎంసీలు)ముచ్చుమరి లిఫ్ట్ నుంచి 810 అడుగులు (34.29 టీఎంసీలు)వరకు మాత్రమే నీటిని పంపు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం పవర్ జనరేషన్ కోసం పక్క రాష్ట్రం వారు రోజుకు 2 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో హంద్రీనీవా కాలువ నీటిపై ఆధారపడిన రైతులు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

• అనుగొండలో హెల్త్ క్యాంపును పరిశీలించిన ఎమ్మెల్యే డా.సుధాకర్



అనుగొండ హెల్త్ క్యాంపులో వృద్ధురాలికి కంటి అద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే డా.సుధాకర్



కొత్తకోట హెల్త్ క్యాంప్‌లో ప్రజలకు మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్ : ప్రజారోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల పల్లెల ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అనుగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సందర్శించారు. క్యాంపులో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లతో చర్చించడంతోపాటు స్వయంగా ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం కూడా జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాన్ని ఇప్పటివరకు చేపట్టలేదన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే నాణ్యమైన వైద్యసేవలందుతున్నాయన్నారు. ప్రజలంతా సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. హెల్త్ క్యాంపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 400 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మాదమ్మ, మధుసూదన్‌రెడ్డి, ఉపసర్పంచు వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్, స్థానిక నాయకులు రామకృష్ణారెడ్డి, మధుమోహన్‌రెడ్డి, బలరాం,ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

సి.బెళగల్: ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలను చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తకోట గ్రామ సచివాలయం - 1లో శుక్రవారం మండల అధికారులు, వైద్యులు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను ఎంపీపీ బొంతల మునెప్పతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే సైతం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వృద్ధులకు కంటి అద్దాలు, రోగులకు ఉచితంగా మందులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హెల్త్ క్యాంప్‌లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈసీజీ, రక్త తదితర పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. 329 మందికి వైద్య సేవలను అందించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు మణిమోహన్ రెడ్డి, ఈఓఆర్డీ సందీప్, ఎస్ఐ పీరయ్య, డాక్టర్లు కేధార్‌నాథ్‌గౌడ్, అనిల్, రేష్మ, కంటి వ్యాధి నిపుణుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు రూరల్: ప్రతి ఒక్కరు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ సూచించారు. మండల పరిధిలోని మునగాలలో శుక్రవారం వైద్య సిబ్బంది నిర్వహించిన హెల్త్ క్యాంప్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య సేవలను గ్రామాల్లోకి తీసుకొచ్చారన్నారు. ప్రతి ఊరిలో ఉచితంగా వైద్యం, మందులు అందించేందుకు విలేజ్ క్లినిక్‌లు, 104, ఫ్యామిలీ డాక్టర్ వంటి సేవలను గ్రామాల్లోకి అందుబాటులోకి తీసుకునిరావడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఇంటింటికీ వైద్య సిబ్బంది వచ్చి బీపీ, షుగర్, తదితర పరీక్షలను నిర్వహించి మందులను అందిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచు గోపాల్, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, రామాంజనేయులు, డీలర్ మద్దిలేటి, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ మాధవీలత పాల్గొన్నారు.



ఉల్చాలలో రక్త పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్

ఫ్యామిలీ డాక్టర్ విధానం ఆదర్శం

కర్నూలు సిటీ: ధనవంతులు, పెత్తందారులకు మాత్రమే ఉండే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సీఎం వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని పేదలకు సైతం అందుబాటులోకి తెచ్చారని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కర్నూలు మండల పరిధిలోని ఉల్చాల గ్రామం సచివాలయం -2లో నిర్వహించిన మెడికల్ క్యాంపును ఆయన సందర్శించారు. అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తర్వాత ఎమ్మెల్యే రక్త పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, గ్రామ సర్పంచ్ విద్యా సాగర్, వైద్యులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



చిందుకూరు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో బీపీ చెక్ చేస్తున్న డాక్టర్



పాణ్యం..ఈసీజీ పరీక్ష చేస్తున్న దృశ్యం

గడివేముల: పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, డాక్టర్ మొల్లా జబీన్ అన్నారు. మండల పరిధిలోని చిందుకూరు గ్రామం ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామంలో 320 మందికి పైగా ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ వెంకటక్రిష్ణారెడ్డి, ఎంపీహెచ్ఈఓ మహేశ్వరరెడ్డి, పీహెచ్ఎస్ సర్వేశ్వరమ్మ, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు:

చిందుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్ (జనరల్),డాక్టర్ హర్షనంద్ (క్రిటికల్ కేర్), డాక్టర్ దీప్తి (చర్మవ్యాధి నిపుణులు) అప్తాల్మిక్ అసిస్టెంట్ వరప్రసాద్ శిబిరానికి వచ్చిన వైద్య పరీక్షలు నిర్వహించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 516 మంది ఓపీ చూయించుకోగా, 120 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, చక్కెర, రక్త తదితర పరీక్షలతో పాటు ఈసీజీ కూడా చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీఓ దస్తగిరి, సర్పంచ్ ఉసేన్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు గణేష్, జేఎస్ రెడ్డి, వెంకటనాగిరెడ్డి, ఉసేన్‌సా, నాయకులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేశారు



నేను కొన్ని రోజుల నుంచి కంటి సమస్యతో బాధపడుతున్నాను. ఈ రోజు మా గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. త్వరలోనే కంటి అద్దాలను కూడా ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మాకు వైద్యసేవలు అందిస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

–సంపంగి పుల్లమ్మ,చిందుకూరు

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



కొన్ని రోజులు నుంచి నేను ఆయాసంతో బాధపడుతున్నాను. పలు ఆసుపత్రులకు తిరిగాను. ఇప్పుడు మా గ్రామంలోనే జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు కూడా ఇచ్చారు. గతంలో ఇలా ఏ ప్రభుత్వం మా ఆరోగ్యం గురించి పట్టించుకోలేదు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్ బాబుకు కృతజ్ఞతలు.

–పద్మావతమ్మ, చిందుకూరు

పెండింగ్ ఫారాల పరిశీలనకు చర్యలు

• పాణ్యం నియోజకవర్గ అధికారులకు జేసీ నారపురెడ్డిమౌర్య ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య , హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లోని ఫారం-6,7,8 లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పాణ్యం నియోజవకర్గ ఈఆర్ఓ, జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గ ఓటరు జాబితా సవరణపై ఆ నియోజకవర్గ రాజకీయపార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి వస్తే తగు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనులు అక్టోబర్‌లోపు పూర్తయ్యే పాఠశాలల్లోనే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో రెండు శాతం కంటే ఎక్కువ అడ్మిషన్స్‌ను చేసిన వాటిని పూర్తిస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ఫారం-6 డిస్పోజ్‌కు దరఖాస్తుదారుడి చిరునామా కోసం ఆధార్ కార్డు, వయస్సు నిర్ధారణ కోసం పదో తరగతి మార్కుల జాబితాను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఫారం-7కు సంబంధించి ఓటరు చనిపోయి ఉంటే కచ్చితంగా డెత్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. లేదంటే ఇరుగు పొరుగు వారితో నిర్ధారణ చేసుకోవాలన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రతినిధులు అనుమంతరెడ్డి, సురేష్ మాట్లాడుతూ..కొన్ని చోట్ల టీడీపీ నాయకులు అనవసరంగా తమ పార్టీ సానుభూతి పరుల ఓటర్లను తొలగించేందుకు ఫిర్యాదులు చేస్తున్నారని, అలాంటి వాటిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో కల్లూరు, ఓర్వకల్ తహసీల్దార్లు రమేష్‌బాబు, శివప్రసాదరెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

రైతుల సేవలో ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు



డ్రోన్ ద్వారా మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పీఎంకేఎస్‌కే అధికారులు

కోడుమూరు: రైతుల సేవలో ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు పనిచేస్తున్నాయని కోరమాండల్ మార్కెటింగ్ రీజనల్ ఆఫీసర్ భాస్కరరెడ్డి సూచించారు. శుక్రవారం కోడుమూరులో కోరమాండల్, పీఎంకేఎస్‌కె కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డి మాట్లాడుతూ పీఎంకేఎస్‌కే కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను అందజేయడంతో పాటు, పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రాలలో మట్టి పరీక్షలను ఉచితంగా చేసి ఏయే మందులు, ఎరువులు వాడాలో రైతులకు సూచించడం జరుగుతుందన్నారు. అలాగే రైతులు ముందుకొస్తే డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ చేసేందుకు పీఎంకేఎస్‌కే సిబ్బంది సిద్ధంగా ఉంటారని, రైతులు సద్వినియోగం చేసుకుని పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ గోవిందరావు, డివిజనల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, డీలర్ అశోకానందరెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది రానివ్వం

- లీకేజీ నీటికి శాశ్వత పరిష్కారం చూపుతాం
- నీట మునిగిన పొలాలను సాగులోకి తెస్తాం
- ఈ విషయంలో ఆందోళన అవసరం లేదు
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని



ఆలమూరులో మహిళకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ ద్వారా వచ్చే లీకేజీ నీటితో నీటి మునిగిన పంటపొలాలను తిరిగి సాగులోకి తెస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలమూరు గ్రామంలో గడప గడపకు-మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో పర్యటించిన ఆయనకు రైతులు కలిసి సమస్యలు విన్నవించారు. ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలకు అక్రమంగా గండ్లు కొట్టారని, వాటి ద్వారా నీరు లీకై దిగువన ఉన్న వందల ఎకరాలు మునిగిపోతున్నాయన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఏ ఒక్కరికీ నష్టం జరగనివ్వమని, ప్రతి రైతు తనకున్న పొలాన్ని సాగు చేసుకునేలా చూస్తామన్నారు. త్వరలోనే ఎస్సార్బీసీ అధికారులతో సమీక్ష నిర్వహించి లీకేజీలు, గండ్లపై చర్చించి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని రైతులకు భరోసా ఇచ్చారు.

ఎస్సీ కాలనీ అభివృద్ధికి చర్యలు

ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. కాలనీలో కాల్వలు, సీసీ రోడ్లు వేస్తామన్నారు. అలాగే పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెట్పీటీసీ సభ్యుడే సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, సర్పంచ్ ముల్ల మహ్మద్‌షరీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లు జయచంద్రారెడ్డి, ఉపేంద్రారెడ్డి, సుబ్బరాయుడు, ఖాజా ఉసేన్, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, పాలెం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మండల కేంద్రం పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. పాణ్యం గ్రామానికి చెందిన లెవెన్‌బ్రోస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో యువకులు తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెట్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ మేకల పల్లవి, నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

పాణ్యం: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే' వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో పేదల విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. అడిగిన వెంటనే పాణ్యంకు డిగ్రీ కళాశాల మంజూరు చేశారన్నారు. దీనిని స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాగా చదువుకుని కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కాలేజీలో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాదికి రెట్టింపు కావాలన్నారు. అనంతరం రూ.15వేలు విలువ గల మైక్ సెట్‌ను ఎంపీపీ ఉసేన్‌బీ కాలేజీకి విరాళంగా అందించారు. కార్యక్రమంలో మాజీ జెట్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ సింహాద్రి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామన్, హెచ్ఎం మేరీ సునీతా, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు పార్వతమ్మ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలెం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ కరుణాకర్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నం శెట్టి పల్లెలో సీసీ రోడ్లు ప్రారంభం

ఓర్వకల్లు: మండల పరిధిలోని చెన్నం శెట్టి పల్లె గ్రామంలో రూ. 17 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యం గ్రామాల్లో అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. జిల్లా మైనింగ్ ఫండ్స్ రూ. 10 లక్షలు, గడప గడప మన ప్రభుత్వం నిధులు రూ.7 లక్షలతో సీసీ రోడ్డు వేశామన్నారు. ప్రజల కోసం పనిచేసే జగన్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మీది వేముల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ గౌడ్, సింగల్ విండో అధ్యక్షుడు నాగతిరుపాలు, సర్పంచ్ జయమ్మ, స్థానిక నాయకులు మదన్ వెంకట్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఆకుల రాముడు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వారధికి ముప్పు!

పక్క చిత్రంలో కనిపిస్తున్నది గడివేముల మండలంలోనే పెద్ద వంతెన. ఇంజినీరింగ్ నైపుణ్యానికి మచ్చు తునక. వందల క్యూసెక్కుల వరద నీటి ఉధృతిని తట్టుకుని నిలబడిన బ్రిడ్జిగా రికార్డు. ఆరు దశాబ్దాల చరిత్ర. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన బూజునూరు వంతెన నేడు ప్రమాదపు అంచుల్లో ఉంది. మరమ్మతులకు నోచుకోక, సామర్థ్యానికి మించిన భారం మోయలేక దెబ్బతింటోంది.



బూజునూరు గ్రామం వద్ద దెబ్బతిన్న వంతెన


- బలహీనపడుతున్న పురాతన కుందూ వంతెన
- 50 ఏళ్ల క్రితం బుజునూరు వద్ద నిర్మాణం
- భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న బ్రిడ్జి
- ఇప్పటికే శిథిలమైన రక్షణగోడలు
- మరమ్మతులపై దృష్టి సారించాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విజ్ఞప్తి

గడివేముల: నంద్యాల-నందికొట్కూరు ప్రధాన రహదారిలో బూజునూరు వద్ద కుందూనదిపై 60 సంవత్సరాల క్రితం పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో వంతెన నిర్మించారు. నాటి అవసరాలకు తగ్గట్టు రాకపోకల దీనిని కోసం నిర్మించారు. దీన్ని ఆర్‌సీసీ(రీఇన్ ఫోర్స్ డ్ సిమెంట్ కాంక్రీట్) పద్ధతిలో కట్టి జిల్లా పరిషత్ నుంచి రహదారులు మరియు భవనాల శాఖకు అప్పగించారు. నాటి నుంచి నేటి వరకు ఈ వంతెనపై రోజూ వందలాది వాహనాలు వెళ్తున్నాయి. వంతెన సామర్థ్యానికి మించిన బరువు గల లారీలు కూడా ఈ వంతెనపైనే రాకపోకలు సాగిస్తున్నాయి.

కానరాని మరమ్మతులు

నాటి కొద్దిపాటి రాకపోకలను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఈ బ్రిడ్జికి గత కొన్ని ఏళ్ల నుంచి గడ్డు కాలం దాపరించింది. సమీపంలోని జిందాల్ సిమెంట్ పరిశ్రమకు బళ్లారి, తెలంగాణ నుంచి స్లాగ్ లాటరైట్, కార్బన్ పౌడర్ తదితర ముడి పదార్థాలు భారీ వాహనాల్లో తెస్తున్నారు. దాదాపు 50 టన్నుల పైనే బరువు గల ఆయా వాహనాల రాకపోకలతో వంతెన విపరీతమైన ఒత్తిడికి గురవుతోంది. వంతెన అడుగుభాగంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. పలు చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. 30 శాతం పైనే రక్షణ గోడలు శిథిలమయ్యాయి. ఎప్పుడో 2015-16 సంవత్సరంలో రూ. 10 లక్షలతో మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలు పంపగా ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. రాష్ట్ర రహదారి 48పై ఉన్న ఈ వంతెనపై తరచుగా శాఖాధికారులు తిరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.


కొత్త బ్రిడ్జి నిర్మించండి



మా గ్రామం సమీపంలో నంద్యాల రహదారిపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జి కింద పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో పాటు బ్రిడ్జి రక్షణ గోడలు కూలిపోయాయి. ఎక్కువ లోడు వాహనాలు తిరుగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. దాని స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేయాలి.

–చిన్న శాలుమియ్య, బూజునూరు గ్రామం

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



బూజునూరు వద్ద ప్రధాన రహదారిపై ఉన్న వంతెనను గత ప్రభుత్వాలు ఏనాడు పట్టించుకోలేదు. దాదాపు అరవై ఏళ్ల కింద నిర్మించిన బ్రిడ్జి. ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. నిత్యం వందలాది వాహనాలు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

–పైపాలెం ఉసేన్, గడివేముల

మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం

కుందూ నది వంతెన దెబ్బతిన్న విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. త్వరలోనే దానిని పరిశీలించి మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే వంతెనపై భారీ వాహనాలు తిరగకుండా చూస్తాం.

–మనోహర్, ఏఈఈ, అర్అండ్‌బీ, నందికొట్కూరు

రైతులకు సరిపడా శనగ విత్తనాలు పంపిణీ చేశాం



కోడుమూరులో రైతులకు వేరుశనగ మినీకిట్లు అందజేస్తున్న డీఏఓ వరలక్ష్మి

కోడుమూరు రూరల్ : రబీ సీజన్‌కు రైతులందరికీ సరిపడే సబ్సిడీ శనగ విత్తనాలను ప్రభుత్వ అందజేయడం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం కోడుమూరులోని రైతు భరోసా కేంద్రంలో డీఏఓ వరలక్ష్మి రైతులతో సమావేశమయ్యారు. పంటల సాగుపై చర్చించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే సబ్సిడీ శనగ విత్తనాలను ఎకరాకు 40కిలోల చొప్పున అందజేసిందన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు మంచి వర్షాలు పడిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. శనగ పంట సాగు చేసిన రైతులకు సబ్సిడీ పై పురుగుమందులను అందజేయాలని, కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని, బోర్లు ఉన్న రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలివ్వాలని డీఏఓ వరలక్ష్మిని కోరారు. స్పందించిన ఆమె విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రైతులకు వేరుశనగ మినీ కిట్లను జేడీఏ పంపిణీ చేశారు. సమావేశంలో కోడుమూరు ఏఓ రవిప్రకాష్, సలహామండలి సభ్యులు సురేంద్రరెడ్డి, నాగేశ్వరరెడ్డి, లక్ష్మన్న, శ్రీను, మహేష్, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.